


**రెచ్చిపోయిన 'పచ్చ'మూకలు**

తాడిపత్రి మండలం ఆలూరులో 'పచ్చ' మూకలు రెచ్చిపోయాయి. వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులకు తెగబడ్డాయి. 8లో



**జెడ్పీ సీఈఓగా శివశంకర్**

జెడ్పీ సీఈఓగా శివశంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 8లో

గరిష్టం/కనిష్టం
37.4°/22.1°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### చదువులపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి

- కలెక్టర్ వినోద్ కుమార్



విద్యార్థులకు పురస్కారాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సునీత

**అనంతపురం ఎడ్యుకేషన్:** చదువు పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని కలెక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని 3వ రోడ్డు జీఆర్ ఫంక్షన్ హాల్‌లో 'షైనింగ్ స్టార్స్ – 2025' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చాలామంది పిల్లలు పెద్దపెద్ద సాధనలు చేశారన్నారు. ఇందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారో ఆ కలలు నిజమవుతాయన్నారు.పిల్లలు వినూత్న ఆలోచనలు చేయాలన్నారు. అందరూ ఒకే బాటలో కాకుండా ప్రత్యేకత ఏంటి అనేది ఆలోచించాలన్నారు. గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు సంబంధించి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తామన్నారు. 'షైనింగ్ స్టార్స్' ఇతర పిల్లలకు దిక్సూచిగా ఉండాలన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 'షైనింగ్ స్టార్స్' ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. అనంతరం 184 మంది 10వ తరగతి, 35 మంది ఇంటర్ విద్యార్థులకు ఒక్కొక్కరికి మెడల్, సర్టిఫికెట్, రూ. 20 వేల చొప్పున చెక్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, డీఈఓ ప్రసాద్ బాబు, డీవీఈఓ వెంకటరమణ నాయక్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు,బీసీ సంక్షేమ శాఖ డీడీ ఖుష్బూ కొఠారి పాల్గొన్నారు.

### మరో ఇద్దరికి కోవిడ్ పాజిటివ్



**అనంతపురం మెడికల్:** జిల్లాలో మరో ఇద్దరికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఓ బాలింత (పెద్దవడుగూరు), అనంతపురం రామ్‌నగర్‌కు చెందిన ఓ వివాహితకు సోమవారం నిర్వహించిన ర్యాపిడ్ కిట్ పరీక్షలో కోవిడ్ ఉన్నట్లు వెల్లడైంది. బాలింతను ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్సనందిస్తున్నారు. రామ్‌నగర్‌కు చెందిన మహిళ హోం ఐసోలేషన్‌లోనే చికిత్స పొందుతోంది. ఈ రెండు కేసులతో కలిపి జిల్లాలో కోవిడ్ కేసుల సంఖ్య నాలుగుకు చేరింది.

### 'వెబ్ కౌన్సెలింగ్ వద్దే వద్దు'



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.గోవిందరెడ్డి

**అనంతపురం ఎడ్యుకేషన్:** సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలకు సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ వద్దే వద్దని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు స్పష్టం చేశారు. మ్యానువల్ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉపాధ్యాయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ ఎస్జీ టీచర్లకు మ్యానువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు జరుగుతాయని గతంలో మాట ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు మాట తప్పి వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ఉపాధ్యాయ బదిలీలు చేపట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారులు మొండి వైఖరితో ముందుకెళ్తున్నారని, విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ఉపాధ్యాయుల సత్తా ఏంటో ప్రభుత్వానికి తెలియజేస్తామని హెచ్చరించారు. దీక్షలో ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు కే. గోవిందరెడ్డి, నాగిరెడ్డి, గోపాల్ రెడ్డి, సిరాజుద్దీన్, రాయల్ వెంకటేష్, కులశేఖర్ రెడ్డి, శ్రీనివాస నాయక్, శంకరమూర్తి, లింగమయ్య,గోవిందరాజులు, సుబ్బరాయుడు నాగేంద్ర, రవికుమార్, ఎస్. రమణారెడ్డి, రామాంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, మహమ్మద్ రఫీ, రమణ, సర్దార్ వలి, ఈశ్వరయ్య, తిప్పేస్వామి, హర్షవర్ధన్, రాజేంద్రప్రసాద్, సుదర్శన్ రెడ్డి, ఆదిశేషు, రామకృష్ణారెడ్డి, తిమ్మారెడ్డి, కేశవరెడ్డి, సాయినాథ్ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణ, కేశవమూర్తి, నరసింహారెడ్డి, గోపాల్ నాయక్, ఎర్రిస్వామి, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థిని దారుణహత్యపై పెల్లుబికిన ప్రజాగ్రహం

- ప్రజల్లో కట్టలు తెంచుకున్న ఆవేశం
- కూటమి ప్రభుత్వ అలసత్వంపై ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల మండిపాటు
- అబలలకు రక్షణ ఎక్కడ అంటూ ఆవేదన
- బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ బాసట
- న్యాయం చేయాలంటూ ఆందోళన... ఎస్పీకి వినతిపత్రం





హతురాలు తన్మయి తల్లిదండ్రులతో కలిసి ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

**అనంతపురం:** గిరిజన విద్యార్థిని దారుణ హత్యపై ప్రజాగ్రహం పెల్లుబికింది. యువతిని అతి కిరాతకంగా చంపిన వైనంపై ప్రజల్లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయి. రాస్తారోకోలు చేపట్టారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారు. దుండగులను కఠినంగా శిక్షించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

**తోడుగా మేమున్నామంటూ..**

బాధిత గిరిజన కుటుంబానికి వైఎస్సార్ సీపీ బాసటగా నిలిచింది. తోడుగా మేమున్నామంటూ కదం తొక్కింది. సోమవారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎస్పీ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఎస్పీ కార్యాలయం మెయిన్ గేట్ ముందు రెండు గంటల సేపు ధర్నా చేశారు. హతురాలు తన్మయి తల్లిదండ్రులతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్ గౌడ్, పార్టీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగితే సహించేది లేదన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏమయ్యారంటూ నిలదీశారు. విద్యార్థిని తన్మయిని దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నరేష్ అనే వ్యక్తిపై అనుమానం ఉందని బాధిత తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని వాపోయారు. ఎస్పీకి వినతిపత్రం అందించేందుకు వెళ్తుండగా పోలీసులు గేట్లు మూసివేశారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, నేతలకు మధ్య తోపులాట జరిగింది. వైఎస్సార్‌సీపీ కండువా వేసుకున్న వారిని లోపలికి అనుమతించేది లేదంటూ అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్‌తో వాదించారు. కలెక్టర్ కార్యాలయంలోకే పార్టీ కండువా వేసుకుని ప్రజల సమస్యలపై విన్నవించేందుకు వెళ్తామని పేర్కొనడంతో అనుమతించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి,పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదు, నాయకులు శివ శంకర్ నాయక్,అనుబంధ విభాగాల అధ్యక్షులు అమర్ నాథ రెడ్డి,చంద్రశేఖర్ యాదవ్, శ్రీనివాస నాయక్, టీటీడీ మాజీ మెంబర్ అశ్వర్థ నాయక్, కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, కమల్ భూషణ్, అనిల్ కుమార్ రెడ్డి, సాకే చంద్రలేఖ, శేఖర్ బాబు, శ్రీనివాసులు, విద్యార్థి నాయకులు మంజునాథ రెడ్డి, వెంకటేశ్, కైలాష్, రాహుల్ రెడ్డి, నిశాంత్‌రెడ్డి, అశోక్, శేఖర్, ప్రశాంత్,సాయి నితిన్, అంజన్ రెడ్డి, ఫయాజ్ బాషా, మహిళా నేతలు ప్రియాంక, భారతి, మహేశ్వరి, సల్మా, చంద్రగిరి రాధా, పార్వతి, సుజాత రెడ్డి, అంజలి, శోభ, రాంప్రసాద్, ఎంఎస్ఎస్ సాదిక్, సాకే కుళ్లాయిస్వామి, గోవింద్ నాయక్, గిరిజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నగర అధ్యక్షుడు శ్రీనివాసులు, గుజ్జల శివయ్య, ఆనంద్, సురేంద్ర, మోహన్ నాయక్, శివ, కావాడి వీర, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### న్యాయం జరగకపోతే చావే దిక్కు



మాట్లాడుతున్న తన్మయి తల్లి అరుణ

ఎస్పీకి వినతిపత్రం అందించిన అనంతరం తన్మయి తల్లి అరుణ, నాయకులు మీడియాతో మాట్లాడారు. తమ ఒక్కగానొక్క బిడ్డనూ పొట్టన పెట్టుకున్నారని అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. 'మంగళవారం రాత్రి తన్మయి బయటకు వెళ్లింది. రాత్రంతా వెతికినా కనిపించలేదు. బుధవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాం. అనుమానితుడి పేరు చెప్పి వాడి ఫోన్ నంబర్ కూడా ఇచ్చాం. వాడే మా అమ్మాయికి చివరి ఫోన్ చేశాడని చెప్పాం. అయినప్పటికీ ఘోరాన్ని ఆపలేకపోయారు. పోలీసుల వైఫల్యం వల్లే బిడ్డను కోల్పోయాం. నా బిడ్డ ఎంతటి వేదన పడిందో.. వాడు కూడా అలాగే నరకయాతన అనుభవించాలి. మాకు న్యాయం జరగకపోతే చావే దిక్కు' అంటూ అరుణ వాపోయారు.

### సీపీఎం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

**అనంతపురం అర్బన్:** గిరిజన విద్యార్థిని తన్మయిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వరుస ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. విద్యార్థిని తన్మయి హత్య, ఏడుగుర్రాలపల్లిలో బాలికపై అత్యాచారం అత్యంత దారుణమన్నారు. ఏడుగుర్రాలపల్లి ఘటనలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాల్సింది పోయి బెదిరింపులకు పాల్పడడం చూస్తే పోలీసులు నిందితులకు అనుకూలంగా పనిచేస్తున్నారనేది స్పష్టమవుతోందన్నారు. ఎవరిని రక్షించడానికి ఇలా చేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వలి, ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, లక్ష్మీనరసమ్మ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

### తల్లి ఘోష వినపడడం లేదా?

రామగిరి మండలంలో బాలికను నెలల పాటు కీచకులు అత్యాచారం చేశారు. చిలమత్తూరు మండలంలో అత్తా, కోడళ్లపై అత్యాచారానికి పాల్పడ్డారు. వైఎస్సార్ కడప జిల్లాలో మూడు సంవత్సరాల పసికందును అత్యాచారం చేసి చంపేశారు. ఈ క్రమంలో రాష్ట్రంలో బాలికల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. అఘాయిత్యాలకు పాల్పడే వారిని స్పాట్‌లోనే శిక్షిస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్కడ ఉన్నారు? తన్మయి తల్లి ఘోష మీకు వినపడడం లేదా?

–బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

### ప్రశాంతత ఏదీ?

సీఎం చంద్రబాబు మాటలకే పరిమితమవుతున్నారు. నాలుగు రోజుల క్రితం స్వయానా మేయర్ హోదాలో నేను నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఇప్పటి దాకా కేసు నమోదు చేయలేదు. ఎస్పీకి ఫిర్యాదు ఇచ్చినా స్పందించలేదు. గతంలో అనంతపురం నగరంలో ప్రశాంతత ఉండేది. కూటమి ప్రభుత్వంలో ఏం జరుగుతోందో ప్రజలు గమనించాలి.

– వసీం సలీం, మేయర్

### పవన్‌కల్యాణ్ ఎక్కడ?

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో దాదాపు 200 మంది మహిళలపై అత్యాచారాలు జరిగాయి. గతంలో ఏమీ లేని అంశంలోనే తిరుమల మెట్లు కడిగిన పవన్ కల్యాణ్.. ఇప్పుడు అమ్మాయిలపై అఘాయిత్యాలు జరుగుతుంటే పాప ప్రక్షాళన చేయడం లేదు. తన్మయి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి.. న్యాయం చేయాలి.

– రమేష్ గౌడ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

### దుఃఖసాగరంలో సమాజం

జిల్లాలోనే ఎన్ని అఘాయిత్యాలు, అకృత్యాలు జరుగుతున్నాయో చూస్తున్నాం. తన్మయి దారుణ హత్య ఘటన సమాజాన్ని దుఃఖసాగరంలోకి నెట్టింది. పోలీసులు సరైన సమయంలో స్పందించి ఉంటే ఈ దారుణం జరిగి ఉండేది కాదు. అన్యాయం ఎక్కడ జరిగితే అక్కడ ఉంటా అన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్కడున్నారో అర్థం కావడం లేదు.

– వాసంతి సాహిత్య, డిప్యూటీ మేయర్

### కఠినంగా శిక్షించాలి

ఏడు గుర్రాలపల్లిలో జరిగిన ఘటనపై అధికార పార్టీ నాయకులు ఏ విధంగా స్పందిస్తున్నారో అందరికీ తెలుసు. అనంతపురం నగరంలోని రామకృష్ణ కాలనీలో ఉండే ఇంటర్ విద్యార్థిని తన్మయిని దారుణంగా హత్య చేసిన ఘటన అందరినీ కలచివేస్తోంది. అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి.

– శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు

### మహిళలకు రక్షణ లేదు



కలెక్టరేట్ ముందు మహిళా సమాఖ్య నిరసన

**అనంతపురం అర్బన్:** కూటమి ప్రభుత్వంలో మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతిప్రసాద్, పద్మావతి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై 14 మంది కీచకులు నెలలుగా అత్యాచారానికి పాల్పడడం అత్యంత అమానుషమన్నారు. రోజూ ఎక్కడో ఒక చోట ఇలాంటి అమానవీయ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### ఒకరికి ఉద్యోగమివ్వాలి



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న శంకర్‌నాయక్

**అనంతపురం అర్బన్:** తన్మయిని దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. డీఆర్‌ఓ మలోలను సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. తన్మయి కుటుంబానికి ఐదెకరాల వ్యవసాయ భూమి, నగరంలో ఐదు సెంట్ల స్థలం, కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, భాస్కర్ నాయక్, హనుమంతునాయక్ పాల్గొన్నారు.

### అడ్డుకట్ట వేయాలి



డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**అనంతపురం అర్బన్:** తన్మయిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని,ఇప్పటికైనా అరాచకాలకు అడ్డుకట్ట వేయకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్‌అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల ఎల్లన్న పేర్కొన్నారు. డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణారెడ్డిని సోమవారం కలెక్టరేట్‌లో కలిసి వినతిప్రతం అందజేశారు. ఇటీవలి కాలంలో దళిత, గిరిజన మహిళలపై అత్యాచారాలు, దాడులు, హత్యలు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రామచంద్ర, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

### యంత్రాంగం విఫలం




నిరసన తెలుపుతున్న ఏఐఎంఎస్ఎస్ నాయకురాళ్లు

**అనంతపురం అర్బన్:** దారుణాలను అరికట్టడంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమయ్యాయని ఏఐఎంఎస్ఎస్, ఏఐడీఎస్ఓ నాయకులు మండిపడ్డారు. సోమవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. అనంతపురంలో ఇంటర్ విద్యార్థిని తన్మయిని దారుణంగా హత్య చేసిన దుండగులతో పాటు ఏడుగుర్రాలపల్లిలో బాలికపై అత్యాచారం చేసిన కీచకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకురాళ్లు, నాయకులు గురులక్ష్మి, పద్మావతి, ప్రసూన, గౌతమి, చరణ్‌రాజ్, చరణ్‌దీప్,నీలకంఠ, తదితరులు పాల్గొన్నారు.

### పెరిగిన అరాచకాలు



మాట్లాడుతున్న రాంభూపాల్

**అనంతపురం అర్బన్:** కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మద్యం, ఇతర వ్యసనాల వల్ల అరాచకాలు పెరిగిపోయాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ విమర్శించారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాలరంగయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో రాంభూపాల్‌తో పాటు జిల్లా కార్యదర్శి నల్లప్ప పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లా ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు.

## మహిళల మాన ప్రాణాలకు రక్షణ కల్పించలేరా?

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపాటు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం కార్పొరేషన్:** 'బిహార్‌లోని చంబర్ లోయకంటే కూడా ఏపీలో మహిళలపై అత్యాచారాలు పెచ్చుమీరాయి. మహిళలు, యువతుల మాన ప్రాణాలకు రక్షణ కల్పించలేని నిస్సహాయ స్థితిలో పోలీసు శాఖ ఉంది' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. సోమవారం నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు, బాలికలు, చిన్నారులకు రక్షణ కల్పించకపోతే వైఎస్సార్ సీపీ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. సోషల్ మీడియాలో యువత ఏదైనా పోస్టులు పెడితేనే చర్యలు తీసుకునే పోలీసులు.. మహిళల ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

**పోలీసుల నిర్లక్ష్యంతోనే దారుణ హత్య..**

అనంతపురంలోని రామకృష్ణ కాలనీకి చెందిన తన్మయి తప్పిపోయిందని ఈ నెల 3న బాధిత తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయిస్తే వారు పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలోనే ఐదు రోజుల తర్వాత తన్మయి శవమై తేలిందన్నారు. పోలీసుల అలసత్వం కారణంగానే యువతి దారుణ హత్యకు గురైందని తెలిపారు. బాధిత యువతి తల్లిదండ్రులు అనుమానితుడి పేరు చెప్పినా అరెస్టు చేయకుండా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారన్నారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో అధికార పార్టీకి చెందిన వారి ప్రమేయంతోనే బాలికపై సామూహిక అత్యాచారం జరిగిందని, దీనిపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం కావడంతో, దీన్ని ఆసరాగా తీసుకున్న మృగాళ్లు నిత్యం ఏదో ఒక చోట మహిళలు, బాలికలు, యువతులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఏడాది కూటమి పాలనలో 188 అత్యాచార ఘటనలతో పాటు 15 మంది హత్యలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

**మిస్సింగ్‌లపై మాట్లాడండి పవన్..**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎక్కడో తెలంగాణాలో అత్యాచారం జరిగితే ఏపీలో అటువంటి పరిస్థితులు తలెత్తకూడదని 'దిశ' పోలీసు స్టేషన్, యాప్‌ను ప్రవేశపెట్టి మహిళలకు అండగా నిలిచారని 'అనంత' గుర్తు చేశారు. అప్పట్లో పవన్ కల్యాణ్, చంద్రబాబు రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని నానా యాగీ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కేవలం అనంతపురం జిల్లాలోనే 72 మంది మిస్ అయ్యారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దీనిపై మాట్లాడాలని సూచించారు.

**ఆదాయాలకు జీ హుజూర్..**

ఆదాయం తెచ్చిపెట్టే సెటిల్‌మెంట్లకు పోలీసులు జీ హుజూర్ అంటున్నారని 'అనంత' విమర్శించారు. జిల్లాలో ఎస్పీ, డీఎస్పీలు చెబితే వినే స్థితిలో సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు లేరని, ప్రజాప్రతినిధులే బాస్‌లన్న ధోరణితో నడుచుకుంటున్నారని దుయ్యబట్టారు. మేయర్ వసీం చాంబర్‌లో దౌర్జన్యం, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి చింతకుంట మధుపై దాడి, సచివాలయ ఉద్యోగిపై దాడిపై ఫిర్యాదు చేస్తే పోలీసులు స్పందించడం లేదని, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినా కేసు నమోదు చేయకపోతే ఎలాగని ప్రశ్నించారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఐదేళ్లకోసారి మారతారని, డీజీపీ మరికొన్ని నెలల్లో పదవీ విరమణ పొందుతారని, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని ఆయన హితవు పలికారు.

### మంత్రి బంధువులకే దిక్కులేదు..

ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న 'అనంత' నగరంలో కూటమి ప్రజాప్రతినిధుల నిర్వాకంతో ఆందోళనకర వాతావరణం నెలకొందన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి భరత్ బంధువులైన శ్రీనివాస్‌గుప్తా, వెంకటేష్ గుప్తాల స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని సాక్షాత్తు బాధితులే చెప్పారన్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధి, మరో నాయకుడు ఇద్దరూ నేర చరిత్ర కల్గిన వారని, ఎవరికి వారు కింగ్ మేకర్లుగా మారాలనుకుని ఫిర్యాదులు చేసుకున్నారన్నారు. విచ్చలవిడిగా మట్కా, ఎంఆర్‌పీ కంటే అధికంగా మద్యం విక్రయాలు, భూ దందాల ఘటనలు ఎక్కువయ్యాయన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు, నాయకులు నార్పల సత్యనారాయణ రెడ్డి, మల్లెల వేణు, చామలూరు రాజగోపాల్, కార్పొరేటర్ శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జీవితంలో యోగా భాగం కావాలి



యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం కార్పొరేషన్:** ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఓ భాగం కావాలని, తద్వారా ఎన్నో రకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని వివిధ సచివాలయాల పరిధిలో ర్యాలీలు నిర్వహించారు. 65వ సచివాలయం పరిధిలో జరిగిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని, ఎస్ఈ చంద్రశేఖర్, తహశీల్దార్ హరికుమార్, కార్పొరేటర్లు శేఖర్ బాబు, టీవీ చంద్రమోహన్ రెడ్డి, పలువురు యోగా గురువులు పాల్గొన్నారు.

- రాయదుర్గంలోని శాంతినగర్‌లో వైఎస్సార్ విగ్రహం వెనుక సర్వే నంబర్ 225-ఏలో రూ.కోటి విలువ చేసే సుమారు 10 సెంట్ల స్థలాన్ని కాజేసేందుకు ఓ వ్యక్తి విస్తృత ప్రయత్నాలు చేపట్టాడు. ఈ అంశంపై పత్రికల్లో పలుమార్లు వరుస కథనాలు వెలువడడంతో అధికారులు హెచ్చరిక బోర్డు పాతారు. అయితే రాత్రికి రాత్రే ఆ బోర్డు తొలగించారు. ఆ తర్వాత గతంలో పనిచేసిన ఓ రెవెన్యూ అధికారి ద్వారా నకిలీ పట్టా సృష్టించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు.



# భూమిని మడత పెట్టి..

- దుర్గం మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న కబ్జాల పర్వం
- విలువైన స్థలాలపై అక్రమార్కుల కన్ను
- నకిలీ పట్టాలతో బోగస్ రిజిస్ట్రేషన్లు

**రాయదుర్గం:** కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం మున్సిపాలిటీ పరిధిలో పరిశ్రమలు విస్తృతంగా ఏర్పాటయ్యాయి. దీంతో పట్టణ ప్రాంతంలో స్థిరపడే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీనికి తగినట్లుగా పట్టణ పరిధి సైతం నలుమూలల విస్తరిస్తోంది. దీంతో రాయదుర్గం మున్సిపాలిటీ పరిధిలో సెంటు స్థలం రూ.8 లక్షల నుంచి రూ.14 లక్షలకు ఎగబాకింది. ఇలాంటి తరుణంలో విలువైన ప్రభుత్వ స్థలాలపై కబ్జాదారుల కన్నుపడింది. కుర్చీని మడతపెట్టినంత సులువుగా భూమిని మడతపెట్టి ఎంచక్కా స్వాహా మనిపించేస్తున్నారు.

**మచ్చుకు కొన్ని..**

- రాయదుర్గంలోని బళ్లారి మార్గంలో ఉన్న పురాతన గంగమ్మ బావి కొన్ని దశాబ్దాలుగా ఆ ప్రాంత వాసుల దాహార్తిని తీరుస్తోంది. శుభకార్యం ఏది జరిగినా బావి, నాగుల వద్ద పూజలు చేస్తుంటారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉండడంతో ఆ పక్కనే నివాసముంటున్న వ్యక్తి ఆ స్థలంపై కన్నేశాడు. వెంటనే బోగస్ పట్టా సృష్టించి దాని ఆధారంగా బావి ఫొటోను మార్ఫింగ్ చేయించాడు. గంగమ్మబావి చుట్టూ ఉండే చెక్‌బందీని ఎక్కడో శాంతినగర్‌లో ఉండే సర్వే నంబర్ 299కు జత చేయించి అనంతపురంలోని కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ ఘటన ఇటీవల వెలుగు చూడడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ విలువైన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని కంచె నిర్మించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. అయినా ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి చర్యలూ లేవు.
- పట్టణంలోని గొల్లపల్లి రోడ్డులో సర్వే నంబర్ 110లో ఉన్న 50 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని బెస్త కులస్తుల శ్మశాన వాటికకు కేటాయించారు. ఇందులో సమాధులు కూడా ఉన్నాయి. దీని పక్కనే ఉన్న కొంత మిగులు స్థలంలో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి కొందరు ప్రయత్నించారు. దీంతో బెస్త కులస్తులు ఆందోళన చేపట్టారు. తమ స్థలం కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడాలని తహసీల్దార్‌తో పాటు కలెక్టర్‌కూ ఫిర్యాదు చేశారు. ఈ అంశం ఎటూ తేలకుండా ఉండిపోయింది.
- పట్టణంలోని బీటీపీ లే ఔట్‌లో ఆక్రమణల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అవసరాల కోసం వదిలిన 50 సెంట్ల రిజర్వు స్థలం మొత్తం కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లింది. ఎటుచూసినా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టారు. కొందరైతే ఒక్కో ప్లాటును రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. బినామీలతో ఒక్కొక్కరు 3, 4 ప్లాట్‌లను ఆధీనంలో ఉంచుకున్నట్టు సమాచారం. అలాగే గౌడ, మల్లాపురం లేఔట్లలోనూ కబ్జాల పర్వం కొనసాగినట్లుగా ఆరోపణలున్నాయి.

### సెంటు స్థలాన్ని కూడా వదలం

అన్యాక్రాంతమైన ప్రభుత్వానికి చెందిన సెంటు స్థలాన్ని కూడా వదలకుండా స్వాధీనం చేసుకుంటాం. ఇందులో రాజీ పడేది లేదు. బళ్లారి రోడ్డులోని గంగమ్మబావి, వైఎస్సార్ విగ్రహం వెనుక ఉన్న స్థలాలపై విచారణ జరిపించాం. వాటికి పట్టాలు ఎలా వచ్చాయి? ఎక్కడ రిజిస్ట్రేషన్ జరిపారు అనే అంశాలను పరిశీలిస్తున్నాం. లేఔట్లలోని రిజర్వు స్థలాల్లో కబ్జాకు గురైన వాటిని గుర్తించి స్వాధీనం చేసుకుంటాం. ప్రభుత్వ భూములు, స్థలాలు కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం.

– నాగరాజు, తహసీల్దార్, రాయదుర్గం

## మహిళలపై అఘాయిత్యాలు కన్పించడం లేదా?

- డీసీఎం పవన్‌ను ప్రశ్నించిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



**ఉరవకొండ:** తాము అధికారంలోకి వస్తే మహిళలకు అన్ని విధాలుగా రక్షణ కవచంలా ఉంటూ కాపాడుకుంటానని భరోసానిచ్చిన పవన్‌కళ్యాణ్... అధికారం చేపట్టిన తర్వాత మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నా ఏ మాత్రం స్పందించకపోవడం సిగ్గుచేటని శాసన మండలి ప్రీవిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వరుస హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. అనంతపురంలో ఇంటర్మీడియట్ విద్యార్థిని సాకె తన్మయి కన్పించడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఆఖరుకు బాలికను దారుణంగా హత్య చేసిన తర్వాత హడావుడి చేస్తున్నారన్నారు. అలాగే రామగిరి మండలంలో 14 ఏళ్ల దళిత మైనర్ బాలికను 14 మంది మానవ మృగాలు అత్యంత దారుణంగా అత్యాచారం చేసి గర్భవతిని చేయడం దారుణమన్నారు. వరుస ఘటనలపై హోం శాఖ మంత్రి సైతం నోరు మెదపడం లేదన్నారు.

## వ్యక్తి ప్రాణాలు కాపాడిన లోకో పైలెట్ అప్రమత్తత

**పామిడి:** రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోబోయిన వ్యక్తిని సకాలంలో గుర్తించి లోకో పైలెట్ కాపాడారు. వివరాల్లోకి వెళితే... పెద్దవడుగూరు మండలం కొండూరు గ్రామానికి చెందిన బోయ నాగరాజు (45) కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమై పి.కొండాపురం రైల్వే గేట్ మలుపు వద్దకు సాయంత్రం చేరుకున్నాడు. కాసేపటి తర్వాత రైలు వస్తున్న విషయం గమనించి పట్టాలపైకి చేరుకున్నాడు. గమనించిన లోకో పైలెట్ ఎంతగా హారన్ కొట్టినా ఆయన పైదొలగలేదు. దీంతో లోకో పైలెట్ బ్రేక్‌లు వేయడంతో ఇంజన్ నెమ్మదిగా వచ్చి నాగరాజును ఢీకొంది. ఘటనలో గాయపడిన నాగరాజులను తొలుత స్థానిక సీహెచ్‌సీకి అనంతరం సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై గుత్తి రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**అనంతపురం రూరల్:** నగరంలోని మైనార్టీ బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినుల నుంచి దరాఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ ఏడీ రామసుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి 10వ తరగతి వరకూ చదువుకునే ముస్లిం మైనార్టీ విద్యార్థినులకు 87 శాతం సీట్లు ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులకు 10 శాతం, వికలాంగులకు 3 శాతం సీట్లు కేటాయించారు. పూర్తి వివరాల కోసం జీసస్‌నగర్‌లోని వసతి గృహంలో సంప్రదించవచ్చు.



## మా బాధలు చూడండి



అర్జీదారుతో మాట్లాడుతున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

**అనంతపురం అర్బన్:** 'సార్... మా బాధలు చూడండి. సమస్యల పరిష్కారం కోసం తిరుగుతూనే ఉన్నాం. వాటిని పరిష్కరించి మాకు న్యాయం చేయండి' అంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు పలువురు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 563 వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో పాటు డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, ఆనంద్, వ్యవసాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు.

## బెల్టుషాపులు బంద్ చేయించి గ్రామంలోకి అడుగు పెట్టండి

- ఎక్సైజ్ పోలీసులతో నాటుసారా తయారీదారుల వాగ్వాదం



ఎక్సైజ్ పోలీసులతో వాగ్వాదం చేస్తున్న దృశ్యం

**గుంతకల్లు:** గ్రామాల్లో బెల్టుషాపులు బంద్ చేయిస్తే తాము నాటుసారా తయారీని మానుకుంటామని ఎక్సైజ్ పోలీసులతో గుంతకల్లు మండలం పులగుట్టపల్లి పెద్దతండా వాసులు వాగ్వాదానికి దిగారు. పులగుట్టపల్లి పెద్ద తండాలో ఆదివారం సాయంత్రం గుంతకల్లు ఎక్సైజ్ అధికారులు వెంకటేష్, గోపాల్‌నాయక్, నాగరాజు తనిఖీలు చేపట్టారు. లాలూస్వామి నాయక్ ఇంట్లో పది లీటర్ల నాటుసారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో లాలూస్వామి నాయక్ వాగ్వాదానికి దిగాడు. అదే సమయంలో కృష్ణానాయక్, నెట్టప్పనాయక్, బాలాజీనాయక్‌తో పాటు సీఆర్‌పీఎఫ్ జవాన్ శేఖర్‌నాయక్ అక్కడకు చేరుకుని లాలూస్వామి నాయక్‌కు మద్దతుగా నిలిచారు. బెల్టుషాపులు బంద్ చేయించకుండా మరోసారి గ్రామంలోకి కాలుపెడితే పొలిమేర కూడా దాటలేరంటూ హెచ్చరించారు. ఘటనపై ఎక్సైజ్ సీఐ శివసాగర్‌ను వివరణ కోరగా... జరిగిన ఘటన వాస్తవమేనని అంగీకరించారు. ఇప్పటికే లాలూస్వామి నాయక్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. మంగళవారం పూర్తి స్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.



## బాలిక అదృశ్యం

**ఉరవకొండ:** విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక కనిపించడం లేదు. ఈ మేరకు ఉరవకొండ సీఐ మహానంది సోమవారం తెలిపారు. 17 ఏళ్ల వయసున్న బాలిక ఈ నెల 6న మధ్యాహ్నం ఉరవకొండ మండలం నెరిమెట్లలోని తన అవ్వ ఇంటికి వచ్చింది. కొద్ది సేపటి తర్వాత అవ్వకు తెలిపి బయటకు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాకపోడంతో ఈ నెల 8న బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

**కురాకులతోటలో తల్లీకుమార్తె..**

**కళ్యాణదుర్గం:** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కురాకులతోట గ్రామానికి చెందిన వివాహిత అపరూప, తన మూడేళ్ల వయసున్న కుమార్తె లేహన్యాశ్రీతో కలసి ఈ నెల 6 నుంచి కనిపించడం లేదని సీఐ యువరాజు తెలిపారు. ఆ సమయంలో భర్త తిరుమలేష్ పనిపై బయటకు వెళ్లారన్నారు. బంధువులు, స్నేహితులు ఇళ్లలో ఆచూకీ కోసం గాలించినా లభ్యం కాకపోవడంతో తిరుమలేష్ ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

## అప్పుల బాధతో రైతు బలవన్మరణం

**కుందుర్పి:** అప్పులు తీర్చే మార్గం కానరాక కుందుర్పి మండలం జానంపల్లికి చెందిన రైతు గంగప్ప (55) ఆత్మహత్య చేసుకున్నాడు. తనకున్న ఐదు ఎకరాల పొలంలో రెండేళ్లుగా వివిధ రకాల పంటలు సాగు చేశాడు. పంట పెట్టుబడుల కోసం రూ.3 లక్షల వరకు అప్పులు చేశాడు. పంట దిగుబడులు లేకపోవడంతో అప్పులకు వడ్డీల భారం పెరుగుతూ వచ్చింది. దీంతో కొన్ని రోజుల క్రితం ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గాలించాలినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం సాయంత్రం సమీప గుట్టలో చెట్టుకు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న గంగప్పను అటుగా వెళ్లిన పశువుల కాపర్లు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడు చేరుకుని పరిశీలించారు. మృతదేహం కుళ్లి... దుర్వాసన వెదజల్లుతోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## ఆర్డీటీ లేని ప్రాంతాన్ని ఊహించలేం

- ఆరో రోజు పాదయాత్రలో మాజీ ఎంపీ తలారి రంగయ్య



యర్రగుంటలో మాట్లాడుతున్న రంగయ్య (చిత్రంలో) ఉమామహేశ్వరనాయుడు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్

**కుందుర్పి:** ఆర్డీటీ లేని ప్రాంతాన్ని ఊహించలేమని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేని పాలకులు.. ఆపు లాంటి ఆర్డీటీని జిల్లా నుంచి తరిమేసే కుట్రలకు తెరలేపారని మండిపడ్డారు. రంగయ్య చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర సోమవారం ఆరో రోజు కుందుర్పి మండలం యర్రగుంటకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఆర్డీటీని కాపాడుకుని తీరుతామని మరోసారి స్పష్టం చేశారు.ఈ ప్రాంతంలో ఆర్డీటీ సేవలు ఆగిపోతే జరిగే నష్టాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. తనను అరెస్ట్ చేసినా... చైతన్యవంతులైన ప్రజలే ఆర్డీటీని కాపాడుకుంటారని అన్నారు. గ్రామానికి చెందిన చిట్టెమ్మ మాట్లాడుతూ.... తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, షుగర్ వ్యాధితో బాధపడుతున్న తాను ఇప్పటి వరకూ ఆర్డీటీ ఆస్పత్రిలోనే ఉచితంగా చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఇటీవల విదేశీ నిధులు రాకపోవడంతో ఆస్పత్రిలో మందుల కొరత కారణంగా డబ్బులు ఖర్చు పెట్టి బయట కొనాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీటీ లేకపోతే తన ఇద్దరు పిల్లల పెళ్లిళ్లు ఎలా చేయాలో అర్థం కావడం లేదని కన్నీరు పెట్టుకున్నారు.

- ఆర్డీటీ సేవల పునరుద్ధరణకు తలారి రంగయ్య సాగిస్తున్న పోరాటాన్ని అడ్డుకునేందుకు పోలీసులను పావుగా వాడుకునేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ అన్నారు. పాదయాత్ర అపిలేపల్లికి చేరుకున్న సందర్భంగా ఆయన తలారి రంగయ్యను కలసి సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో మాటాడారు. ఆర్డీటీ లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి సమాంతరంగా పనిచేస్తున్న ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శిలు తిప్పేస్వామి, తరిమెల గోకుల్‌రెడ్డి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు, ఎంపీపీ కమలానాగరాజు, పార్టీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు ఫయాజ్, సత్యనారాయణరెడ్డి, గార్లదిన్నె నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రెచ్చిపోయిన 'పచ్చ' మూకలు

**తాడిపత్రిటౌన్:** మండలంలోని ఆలూరు గ్రామంలో 'పచ్చ' మూకలు రెచ్చిపోయాయి. వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగబడ్డాయి. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, వైస్ సర్పంచ్ రంగనాయకులు, పార్టీ కార్యకర్త తలారి బయన్న, భువనేశ్వర్ ఆదివారం రాత్రి డీజిల్ కోసం సజ్జలదిన్నె గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తుండగా టీడీపీ నాయకులు రవి, పెద్దన్న తదితరులు బొలెరో వాహనంలో వెంబడించి అడ్డుకున్నారు. రంగనాయకులతో వాగ్వాదానికి దిగి దాడి చేయడంతో ఆయన తప్పించుకొని చీకట్లో పారిపోయాడు. అనంతరం వారు బయన్నపై దాడికి తెగబడ్డారు. అనంతరం బొలెరో వాహనంలో ఎక్కించుకొని ఆలూరులోని అతని ఇంటి వద్ద వదిలి కుటుంబ సభ్యులను హెచ్చరించారు. జరిగిన విషయంపై సోమవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. సాయంత్రం వరకు విచారణ పేరుతో స్టేషన్‌లో ఉంచుకోవడం గమనార్హం. చివరకు ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నాయని సీఐ శివగంగాధర్‌రెడ్డి కేసు నమోదు చేయడం విమర్శలకు తావిచ్చింది.

## రైలు ఢీకొని వృద్ధుడి మృతి

**రాప్తాడు:** ప్రమాదవశాత్తు రైలు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... పామిడి మండలం రామరాజుపల్లి గ్రామానికి చెందిన వడ్డే నారాయణ (82) 15 ఏళ్లుగా చిన్మయనగర్ సమీపంలోని పంచాయతీరాజ్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అక్కడే ఉన్న సిమెంట్ పెల్లల పరిశ్రమలో 12 ఏళ్లుగా కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా ఫిట్స్ రావడం, మతి స్థిమితం సరిగ్గా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం రాప్తాడులో పని ఉందంటూ బయలుదేరిన ఆయన పండమేరు వంక రైల్వే వంతెనపై వెళుతుండగా వేగంగా దూసుకొచ్చిన రైలు ఢీకొంది. ఘటనలో ఎగిరి పట్టాల పక్కన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ధర్మవరం రైల్వే పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

## 'దోపిడీ'పై కలెక్టర్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

**రాప్తాడు రూరల్:** అనంతపురం రూరల్ మండలం పూలకుంట గ్రామ శివారులోని గుట్ట నుంచి ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్న వైనంపై కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. మట్టి అక్రమ తరలింపులపై 'సాక్షి'లో 'పట్టపగలే దోపిడీ' శీర్షికతో ఆదివారం ప్రచురితమైన కథనం తెలిసిందే. స్పందించిన కలెక్టర్... సహజ వనరులను కొల్లగొడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ ఆదేశించినట్లు తెలిసింది. మరోవైపు పోలీసు ఇంటిలిజెన్స్ విభాగమూ ఆరా తీసింది. దీంతో రంగంలో దిగిన రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. కృష్ణమరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తిరుపాలు, వడ్డే రమేష్, పూలకుంట జేసీబీ యజమాని వేమారెడ్డి పాత్రపై ఆయా గ్రామస్తులను ఆరా తీశారు. ఆ ప్రాంతమంతా ప్రధానంగా తిరుపాలు, నారా అనంతయ్య పేర్లను ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నారు. పూలకుంట, కృష్ణమరెడ్డిపల్లి, చియ్యేడు వద్ద జరిగిన మట్టి అక్రమ తవ్వకాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీఆర్‌ఏలు నందీశ్వర్, చెన్నయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డికి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. మరోవైపు అక్రమార్కులకు సహకరిస్తున్న పోలీసుల్లోనూ వణుకు మొదలైంది. అలాగే ×సాక్షి×లో వచ్చిన కథనంతో అప్రమత్తమైన అక్రమార్కులు మట్టి తవ్వకాలకు తాత్కాలికంగా బ్రేక్ వేశారు.

## జెడ్పీ సీఈఓగా శివశంకర్



**అనంతపురం సిటీ:** జిల్లా పరిషత్ సీఈఓగా జి.శివశంకర్ నియమితులయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా డ్వామా ఏపీడీగా పని చేస్తున్న ఆయనను రెగ్యులర్ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

## క్లుప్తంగా

### కొమ్మినేని అరెస్ట్ కక్ష సాధింపు చర్యే

**అనంతపురం:** కూటమి ప్రభుత్వం జర్నలిస్టులపై నిత్యం ఎక్కడో చోట దాడులు చేయిస్తోంది. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వార్తలు ప్రచురిస్తున్న సాక్షి దినపత్రిక, సాక్షి విలేకరులపై దాడులు చేయడం దుర్మార్గమని జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి అనిల్ కుమార్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. సాక్షి డిబేట్‌లో జరిగిన ప్రసారంలో కొమ్మినేనికి ఎలాంటి సంబంధం లేదన్నారు. డిబేట్‌లో పాల్గొన్న వ్యక్తి చేసిన వ్యాఖ్యలను కొమ్మినేని ఖండించారని.. అనంతరం బహిరంగ క్షమాపణ చెప్పినా అరెస్ట్ చేయడం కక్ష సాధింపే అన్నారు. ఇలాంటి దాడులపై జర్నలిస్టు సంఘాల నాయకులందరూ స్పందించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఏ జర్నలిస్టు కూడా ధైర్యంగా వార్త రాస్తే ఇలాంటి పరిస్థితులే ఉంటాయని కూటమి ప్రభుత్వం హెచ్చరిస్తున్నట్లు ఉందన్నారు. అరెస్ట్ చేసిన కొమ్మినేని శ్రీనివాస రావును వెంటనే విడుదల చేయకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

### 'భూమిని ఆక్రమించాలని చూస్తున్నారు'

**అనంతపురం అర్బన్:** కక్కలపల్లి గ్రామ పొలం సర్వే నంబర్ 242లోని 3.50 ఎకరాల పట్టా భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితుడు శ్రీనివాసగుప్తా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యను చెప్పుకునేందుకు వచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్‌తో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 1963లో కొనుగోలు చేసినప్పటి నుంచి భూమి తమ అధీనంలో ఉందన్నారు. కొందరు వ్యక్తులు ఈ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇదే క్రమంలో గత నెల 31న ఆ వ్యక్తులు తమపై భౌతిక దాడికి పాల్పడటంతో నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈనెల 2న ఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. అయినప్పటికీ వారు తమను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయలని కోరారు.

### ట్రావెల్స్ బస్సు సీజ్



ఆర్టీఏ కార్యాలయంలో ఉన్న బస్సు

**అనంతపురం సెంట్రల్:** ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టి రాకపోకలు సాగిస్తున్న ఎస్ఆర్ఎస్ ట్రావెల్స్ బస్సును ఆర్టీఏ అధికారులు సీజ్ చేశారు. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాండిచ్చేరి రాష్ట్రం రిజిస్ట్రేషన్‌తో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు రాకపోకలు సాగిస్తున్న ఈ ట్రావెల్స్ బస్సును రాప్తాడు సమీపంలోని మరూరు టోల్‌గేట్ వద్ద ఉప రవాణా కమిషనర్ వీర్రాజు ఆధ్వర్యంలో ఏఎంవీఐ కేవీఎల్ఎన్ ప్రసాద్, ఇతర అధికారులు తనిఖీ చేశారు. రూ.4.50 లక్షలకు పైగా ట్యాక్స్ చెల్లించకుండా రాకపోకలు సాగిస్తున్నట్లు తెలియడంతో బస్సును సీజ్ చేశారు. అయితే ఆ సమయంలో ప్రయాణికులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో ప్రయాణికులతోనే రాప్తాడు నుంచి ఆర్టీఏ కార్యాలయానికి తీసుకొచ్చారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కూడా రంగ ప్రవేశం చేసి ప్రయాణికులను సముదాయించారు. రక్షక్ వాహనంలో ప్రయాణికులను ఆర్టీసీ బస్టాండ్‌కు పంపి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు పంపినట్లు ఆర్టీఏ అధికారులు తెలిపారు.

### నాణ్యత లేని విత్తనకాయలు వెనక్కి పంపండి

**రాప్తాడు:** ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో అందించే విత్తన వేరుశనగ కాయలు నాణ్యతగా లేకపోతే వెనక్కి పంపాలని ఏఓ శ్రీలక్ష్మి సూచించారు. సోమవారం మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల్లో 210 మంది రైతులకు 205.5 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి రైతుకూ వేరుశనగ కాయలు పంపిణీ చేస్తామన్నారు.

### దేశభక్తిని చాటుకోవాలి

**అనంతపురం కల్చరల్:** దేశభక్తిని చాటే వీర శివాజీ లాంటి పుత్రులను ప్రతి ఇంటా ఒకరిని తయారు చేయాలని ఆర్ఎస్ఎస్ ప్రతినిధి సర్వేశ్వరన్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక హౌసింగ్ బోర్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేష్ఠ్య మాసంలో వచ్చే శుద్ధ త్రయోదశి నాడు దేశవ్యాప్తంగా ఛత్రపతి శివాజీ పట్టాభిషక్తుడైన దినాన్ని వేడుకగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, హిమకర్, రత్నమయ్య, కోటి పాల్గొన్నారు.

### నేడు రౌండ్ టేబుల్ సమావేశం

**అనంతపురం అర్బన్:** జిల్లాలో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలపై మంగళవారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



మలుపు వద్ద ఏపుగా పెరిగిన కంపచెట్లు

## రోడ్డును కమ్మేసిన కంపచెట్లు

**చెన్నేకొత్తపల్లి:** మండల పరిధిలోని న్యామద్దెల గ్రామానికి వెళ్లే దారిలో చెరువుకట్ట కింద దాదాపు కిలోమీటరు పొడవునా రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. కంపచెట్ల కొమ్మలు రోడ్డుపైకి రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఈ మార్గంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. మలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయలేదని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## దళితులపై దమనకాండ

**అనంతపురం కార్పొరేషన్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దళితులపై వివక్ష చూపుతూ దమనకాండ సాగిస్తోందని దీంతో దళిత మహిళలు బహిర్భూమికి, కూలి పనులకు వెళ్లలేని దారుణమైన పరిస్థితి నెలకొందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ మండిపడ్డారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో ఓ దళిత మైనర్ బాలికపై 14 మంది సామూహిక అత్యాచారం చేసిన ఘటన మరువక ముందే అనంతపురానికి చెందిన ఓ గిరిజన బాలికను హతమార్చి తగులబెట్టడం దారుణమన్నారు. రెడ్‌బుక్ పేరుతో దళితులను అణచివేసే కుట్రకు కూటమి సర్కార్ తెర తీసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా పోలీసులు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, సర్పంచ్ రామాంజనేయులు, నాయకులు అంజి, ఉల్లికల్లు నారాయణస్వామి, జయరాం, గగన్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చామలూరు రాజగోపాల్

## దళిత, గిరిజనులకు రక్షణ కరువు

**అనంతపురం టవర్‌క్లాక్:** కూటమి ప్రభుత్వంలో దళిత, గిరిజనులకు రక్షణ కరువైందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కుల, ప్రజా సంఘాల నాయకులు తన్మయి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళిత, గిరిజనులపై వరుసగా దాడులు, హత్యలు జరుగుతున్నాయన్నారు. మూడు రోజుల క్రితం జరిగిన తన్మయి హత్య చూస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం అర్థం అవుతోందన్నారు. అమ్మాయి కనిపించలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించక పోవడమే కారణమని తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హత్యచేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో అత్యాచారాలు, హత్యలు, దాడులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోక పోవడం అన్యాయమన్నారు. తక్షణం హంతకులను అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో సురేష్, సుగమంచి శ్రీనివాసులు, పసలూరి ఓబులేసు, ఎర్రిస్వామి, శంకర్ కుళ్ళాయప్ప, రామన్న, దావీదు, కుమార్, రామకృష్ణ, కుళ్ళాయప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై దాడులు కనిపించవా?

**ఆత్మకూరు:** రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై జరుగుతున్న దాడులు కూటమి నాయకులకు కనిపించడం లేదని ఎంపీపీల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సుబ్బర హేమలత ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో మాజీ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పార్వతమ్మ, ఆత్మకూరు సర్పంచ్ వరలక్ష్మి, శిరీష, వన్నూరప్పతో కలసి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. కూటమి పాలకులు మాత్రం ఎంత సేపు దోచుకోవడం, కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరు బాలికలపై అత్యాచారం జరిగితే జిల్లాలోని కూటమి ప్రజా ప్రతినిధులు ఎవ్వరూ కూడా సదురు కుటుంబాలను పరామర్శించిన పాపాన పోలేదన్నారు. న్యాయం చేయమని అడిగితే ఎదురు కేసులు పెట్టడం తప్ప చేసిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత, గిరిజన యువతులపై వరుసగా అత్యాచారం, హత్య జరిగితే హోంమంత్రి అనిత స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. హోంమంత్రి అసమర్థత వల్లే ఇన్ని దారుణాలు చోటుచేసుకుంటున్నాయని మండిపడ్డారు. శింగనమల, మడకశిర ఎమ్మెల్యేలకు ఈ దారుణాలు కనిపించడం లేదా అని ఎద్దేవా చేశారు.



మాట్లాడుతున్న ఎంపీపీల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు హేమలత

## సంక్షిప్త సమాచారం

### ఏడీఎంగా రాఘవేంద్ర కుమార్

**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లా మార్కెటింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా రాఘవేంద్ర కుమార్ నియమితులయ్యారు. తూర్పుగోదావరి జిల్లా తుని మార్కెట్‌యార్డు సెక్రటరీగా పని చేస్తున్న ఈయన్ను జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న సత్యానారాయణ చౌదరిని గుంటూరుకు బదిలీ చేశారు. అలాగే అనంతపురం మార్కెట్ యార్డు సెక్రటరీగా గోవిందు నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న జయలక్ష్మిని కర్నూలుకు బదిలీ చేశారు.

### 'తక్షణం విధుల్లో చేరండి'

- సర్వే, భూరికార్డుల శాఖ డీడీకి ఆదేశం

**అనంతపురం అర్బన్:** తక్షణం విధుల్లోకి చేరాలంటూ ఉమ్మడి అనంతపురం జిల్లా భూరికార్డుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.హరికృష్ణను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలోనే ఆయన డీడీగా నియమితులయ్యారు. రెండు నెలల పాటు విధులు నిర్వర్తించి దీర్ఘకాలిక సెలువుపై వెళ్లారు. దీంతో ఆయనకు వేరొక చోట పోస్టింగ్ ఇవ్వకుండా అనంతపురం జిల్లా డీడీగా తక్షణం విధుల్లో చేరాలని ఆదేశించారు.

### ఖజానా శాఖలో బదిలీలు

**అనంతపురం అర్బన్:** జిల్లా ఖజానా శాఖలో బదిలీల ప్రక్రియ పూర్తయింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం జారీ చేశారు. 20 మంది సీనియర్ అకౌంటెంట్లు, తొమ్మిది మంది జూనియర్ అకౌంటెంట్లు, 11 మంది అటెండర్లు, నలుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లను బదిలీ చేస్తూ ఇతర ప్రాంతాలకు పోస్టింగ్ ఇచ్చారు.

**వ్యవసాయ శాఖలో...**

**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లా వ్యవసాయ శాఖలో నలుగురు సీనియర్ అసిస్టెంట్‌లు బదిలీ అయ్యారు. శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఎం. నాగమణిని, నంద్యాలలో పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను అనంతపురంలోని డీఏఓ కార్యాలయానికి బదిలీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న సునీతను డీడీఏ (ఎస్‌సీ) కార్యాలయానికి, అనంతపురంలో పనిచేస్తున్న మధుమతిని హిందూపురం ఏడీఏ కార్యాలయానికి బదిలీ చేశారు.

### జలవనరుల శాఖలో బదిలీలు పూర్తి

**అనంతపురం సెంట్రల్:** జలవనరుల శాఖలో నాన్ గెజిటెడ్ ఉద్యోగుల బదిలీలు పూర్తయ్యాయి. హెచ్చెల్సీ, హంద్రీనీవా, చిన్ననీటి పారుదల శాఖలో పని చేస్తూ ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారందరికీ స్థాన చలనం కల్పించారు. అలాగే డీఈ, ఈఈల బదిలీలు పూర్తయినప్పటికీ విజయవాడ ఈఎన్‌సీ (ఇంజినీరింగ్ చీఫ్)కార్యాలయం నుంచి అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

### ఐసీడీఎస్ ఏపీడీ వనజా అక్కమ్మ బదిలీ

**అనంతపురం సెంట్రల్:** మహిళా, శిశు సంక్షేమశాఖ పరిధిలోని ప్రాంగణం మేనేజర్‌గా పని చేస్తున్న వనజా అక్కమ్మ (ఏపీడీ) బదిలీ అయ్యారు. గుంటూరు డైరెక్టరేట్ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

### ఉద్యానశాఖ డీడీగా ఉమాదేవి

**అనంతపురం అగ్రికల్చర్:** ఉద్యానశాఖ డీడీగా కర్నూలు ఏపీఎంఐపీ పీడీ డి.ఉమాదేవి నియమితులయ్యారు. ఇక్కడ డీడీగా పని చేస్తున్న జి.ఆండాలు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ ఏడీగా ఉన్న బీఎంవీ నరసింహారావును నెల్లూరుకు బదిలీ చేశారు. శ్రీశైలంలో పని చేస్తున్న ధనుంజయను అనంతపురం ఉద్యానశాఖ ఏడీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## నిర్లక్ష్యం.. తీస్తుంది ప్రాణం



జగనన్న కాలనీలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

**చెన్నేకొత్తపల్లి:** మండల కేంద్రానికి సమీపంలోని జగనన్న కాలనీలో ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా తయారైంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నివాస గృహాలకు దగ్గరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## యోగాతో మానసిక ప్రశాంతత

**అనంతపురం మెడికల్:** యోగాతో పాటు మనం తీసుకునే ఆహార అలవాట్లతో మార్పులు చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్య లభిస్తుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు పేర్కొన్నారు. సోమవారం వైద్య కళాశాల ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, తదితరులు యోగా సాధన చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 21 వరకు యోగా కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించడం జరిగిందన్నారు. అందులో భాగంగా వైద్యులు, విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి మాట్లాడుతూ.. యోగాతో మానసిక ఒత్తిడిని అధిగమించి ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించవచ్చన్నారు. అనంతరం హౌస్‌సర్జన్ యశ్వంతి రాయల్ యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

**రాప్తాడులో..**

**రాప్తాడు:** యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి. యోగా మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద అధికారులు, నాయకులు యోగా సాధన చేశారు. అనంతరం యోగాంధ్రపై ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా విధుల నిర్వహణకు యోగా దోహదం చేస్తుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఏఓ శ్రీలక్ష్మి, ఎంఈఓ మల్లికార్జున, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మ్యూజియం ఏడీగా స్వామి నాయక్

**అనంతపురం కల్చరల్:** జిల్లా పురావస్తు శాఖా సహాయ సంచాలకులుగా స్వామి నాయక్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఏడీగా పని చేసిన రజిత తిరుపతికి బదిలీ అయ్యారు. సోమవారం విజయవాడ నుంచి విచ్చేసిన స్వామి నాయక్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా మ్యూజియం సిబ్బంది ఇంటాక్ (భారతీయ కళలు, వారసత్వ పరిరక్షణ వేదిక) సంయుక్తంగా రజితకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జిల్లా రచయితలు, కవులను ఒకే వేదికపైకి తెచ్చి పురావస్తు శాఖ విశేషాలను అందరికి అందించడంలో రజిత కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి జయకుమార్, కో-ఆపరేటివ్ అధికారి అరుణకుమారి, సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ, రెడ్డి సంఘం శ్రీనివాసరెడ్డి, సినీ దర్శకుడు రషీద్, ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్, శాశ్వత సభ్యులు శ్రీనిధి రఘు, రియాజుద్దీన్, మధురశ్రీ, సాధుశేఖర్, టీపీ రెడ్డి, జూటూరు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఏడీ రజితకు వీడ్కోలు పలుకుతున్న అధికారులు, ఇంటాక్ సభ్యులు

## నేడు పురస్కారాల ప్రదానోత్సవం

**అనంతపురం కల్చరల్:** రంగస్థలానికి విశేష కృషి చేస్తున్న అనంత కళాకారులకు మంగళవారం నందమూరి ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ప్రతినిధులు సుగుమంచి సురేష్, వీఎంపీ నాయుడు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పాతపాటల ప్రేమికుల సమూహం జీవీ రామయ్య, సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు, ఎల్కేపీ కార్యదర్శి గాజుల పద్మజ, సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ, ఆచార్య సుధాకరబాబు తదితరులకు ప్రతిభా అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతపురం క్లబ్ వేదికగా అదే విధంగా సాయంత్రం 5:30 గంటలకు సంగీత విభావరి ఉంటుందని కళాభిమానులందరూ విచ్చేయాలని కోరారు.

## చెత్త సేకరణకు పకడ్బందీ చర్యలు

**అనంతపురం కార్పొరేషన్:** కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలతో ఇంటింటా చెత్త సేకరణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో రూట్ మ్యాప్ ఏర్పాటు చేయడం జరిగిందని కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. సోమవారం వివిధ సచివాలయాలను కవర్ చేస్తూ తయారు చేసిన రూట్‌మ్యాప్‌ను కలెక్టర్ వినోద్ కుమార్‌కు చూపించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ .. ఇటీవల కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ నగరంలోని వినాయక నగర్, రాణి నగర్‌లో పర్యటించి చెత్త సేకరణ జాప్యం కాకుండా ఉండేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారన్నారు. అందులో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో వీధులు, ఇళ్లను గూగుల్ మ్యాప్ ద్వారా ఒక క్రమ పద్ధతిలో రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి డోర్ టూ డోర్ చెత్త సేకరణ చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. నగర ప్రజలు చెత్తను పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదన్నారు. నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.



కలెక్టర్ వినోద్ కుమార్‌కు రూట్ మ్యాప్ చూపిస్తున్న కమిషనర్ బాలస్వామి

### ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఐచర్

**రాప్తాడురూరల్:** రోడ్డు మలుపు దాటేందుకని పక్కన నిలబెట్టుకున్న ట్రాక్టర్‌ను వెనుకవైపు నుంచి వచ్చిన ఐచర్ ఢీకొట్టిన ఘటన సోమవారం అనంతపురం రూరల్ మండలం పాములాయి సమీపంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. బుక్కరాయసముద్రం మండలం గోవిందంపల్లికి చెందిన రైతు పి.దివాకర్‌రెడ్డి వ్యవసాయ పరికరాల రిపేరీ కోసం అనంతపురం వచ్చి తిరిగి ఊరికి బయలుదేరాడు. పాములాయి గ్రామం వద్ద రోడ్డు దాటే క్రమంలో పక్కన నిలబెట్టుకున్నాడు. వెనుకవైపు నుంచి వచ్చిన ఐచర్ వాహనం అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తున్న దివాకర్‌రెడ్డి చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఐచర్ వాహనం అదుపుతప్పి డివైడర్ మీదకు వెళ్లి మధ్యలో ఆగిపోయింది. బాధితుడిని వెంటనే స్థానికులు 108 వాహనంలో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.



బోల్తా పడిన ట్రాక్టర్

### ఫిర్యాదు చేసినా.. కేసు నమోదు చేయలేదు



ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**అనంతపురం:** తనపై దాడి చేసిన టీడీపీ నాయకులు మోహన్ కుమార్, అఖిల్, ఏఆర్ కానిస్టేబుల్ నరేంద్ర, మణి తదితరులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు కోరారు. సోమవారం ఎస్పీ పి.జగదీష్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. దాడి జరిగిన అనంతరం మేయర్ వసీం సలీంతో కలసి నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని తెలిపారు. విచక్షణా రహితంగా దాడి చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వసీం సలీం, తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు విస్తరణ చేపట్టాలి

**అనంతపురం అర్బన్:** సప్తగిరి సర్కిల్‌లో రోడ్డు విస్తరణ చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని హిందూ చైతన్య వేదిక నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు వినతిపత్రం అందజేశారు. వేదిక జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణకు అనుగుణంగా సప్తగిరి సర్కిల్‌లో మసీదు కాంప్లెక్, బాలాజీ లాడ్జి, నితిన్ కాంప్లెక్స్, విశ్వంబర కళ్యాణ మండపం వరకు ఉన్న దుకాణాలు తొలగించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వేదిక నాయకులు వీరాంజనేయులు, రవికుమార్, శ్రీనివాసులు, జైశంకర్, ఎ.రవికుమార్, నాగరాజు, ఓబిరెడ్డి, సురేంద్రప్రసాద్, లక్ష్మన్ పాల్గొన్నారు.

### మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

**అనంతపురం రూరల్:** రైతులు పంటల సాగులో సరైన మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని భారతీయ నూనె గింజల పరిశోధన కేంద్రం (హైదరాబాద్) కీటక శాస్త్రవేత్త డాక్టర్ దురై మురుగన్ అన్నారు. సోమవారం అనంతపురం మండల పరిధిలోని ఏ.నారాయణపురం, తాటిచెర్ల గ్రామాల్లో శాస్త్రవేత్తల బృందం పర్యటించింది . ఈ సందర్భంగా డాక్టర్ దురై మురుగన్ మాట్లాడుతూ.. రైతులు అనవసర పెట్టుబడులను తగ్గించాలని సూచించారు. వేరుశనగ, ఆముదం, కంది, బత్తాయి పంటల సాగు విషయంలో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. అధునాత సాంకేతికత నడుస్తున్న తరుణంలో రైతులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంటలకు డ్రోన్‌ల ద్వారా మందులు పిచికారీ చేయడంతో పాటు, నీరు వృథా కాకుండా జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు మురళీకృష్ణ, శశికళ, పశువైద్యురాలు శారద పాల్గొన్నారు.

### 90 సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలి

**రాప్తాడురూరల్:** రైతులకు 90 శాతం సబ్సిడీతో నాణ్యత కలిగిన అన్ని రకాల పంటల విత్తనాలు సరఫరా చేయాలని సీపీఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతాంగ సమస్యలపై ధర్నా చేపట్టారు. అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. కౌలు చట్టాన్ని తీసుకుని రావాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

**రాప్తాడు:** రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందజేయాలని సీపీఐ, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ, 90 శాతంతో సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు అందించాలనే డిమాండ్‌తో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు.

**ఆత్మకూరు:** కూటమి ప్రభుత్వం ఎన్నికల మందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.